# హోమ్ స్వీట్ హోమ్ (1)

కొందరిళ్ళల్లో మొగుడు హాటూ. పెళ్ళాం స్వీటూ - వైస్ వెర్సా,

ఒకరు హాటుగా వున్నప్పుడు ఆ రెండో వాళ్ళు స్వీటుగా వుంటే అప్పుడు జీవితం హాట్ హాట్‌గా స్వీట్ స్వీట్‌గా వుంటుంది.

'ఐడియల్ హజ్బెండ్ అంటే ఆదర్శపు మొగుడు ఏ బెండూ

లేకుండా తిన్నగా జెండాకొయ్య లాగ ధ్వజ స్తంభంలాగ ఎలక్ట్రిక్ పోల్ లాగ నిలబడి వుండాలని ప్రతి ఆడకూతురూ వాంఛిస్తుంది.

అంతేగాని మొగుడు పప్పు దిమ్మ-క్క-లాగ చప్పు పెద్దమ్మలాగ వెర్రి కుట్టెలాగ వుంటే బాగుండ్ను అని ఏ ఆడదీ కోరదు.

మొగుడు మొద్దబ్బాయి లాగుంటే పెళ్ళాం చొక్కా-లు కుట్టించి ఫ్యాషన్లూ అని మప్పివెంటేసుకొని త్రిప్పి యింతవాడ్ని అంతవాడ్ని చెయ్యొచ్చు.

ఎవర్నో ఒకర్ని మూతి ముక్కు- తుడిచి పెంచి పెద్దవాళ్ళనుచేసి ఆ తర్వాత మొర్రో నేచెప్పిన మాట వినడం లేదని వాపోటం ఆడదాని జన్మహక్కు-.

మొగుడు ఇడియట్ అయితే ఆడదానికి లోకమంతా ఇడియట్టే.

అప్పుడు ప్రేమ పెసరట్టులా వుండదు.

బాదం హల్వాలా వుండదు.

జీళ్ళ పాకంలా వుండదు.

జిడ్డుగా డబల్ బుల్లక్ కార్టు మీద అమెరికా ప్రయాణం పెట్టుకున్న ట్టుంటుంది. లైఫ్ ఈజ్ లైక్ దట్! పెళ్ళాం ఇడియట్ అయితే ఆ సంసారం హైకోర్టెక్కి- ఎప్పుడూ నాలుగురోడ్ల కెంకన్లో వుంటుంది.

సరసం తెలియని మొగుడితో సంసారం అటుకులు నోట్లో పోసు కుని అప్పడం విరిచితిన్నట్లుంటుంది.

సంసారచక్ర పరిభ్రమణంలో

మొగుడు స్వీటుగా వున్నప్పుడు పెళ్ళాం హాట్‌గా. పెళ్ళాం స్వీటుగా వున్నప్పుడు మొగుడు హాట్‌గా "సాంబారిడ్లీ న్యాయప్రకారం మెలగడం కద్దు.

అంటే "హాట్‌హోమ్" "స్వీట్‌హోమ్"

స్వీట్‌హోమె హాట్‌హోమ్‌గా మారుతూ వుంటుంది.

సాంబారిడ్లీ న్యాయమంటే-

సాంబారిడ్లీలో మునిగి తేలినప్పటికి సాంబారు సాంబారే

ఇడ్లీ ఇడ్లీయే.

రెండూ ఒకటికాదు.

ప్లేటులో వున్నపుడు సాంబారిడ్లీ అనే ఏకాభిప్రాయం కలిగించిన ప్పటికీ- ఇడ్లీసాంబారూ రెండూ వేరే.

అలాగే మొగుడూ పెళ్ళాలూనూ —

ప్రకృతీ పురుషుడూ వేరు. అందులో ఎవరు ఇడియట్ అయినా మంచెంబుడు కాఫీలో పంచదారనుకొని మిల్లిగరిటెడు వుప్పేసినట్లు అవుతుంది

బియ్యంనిండా రాళ్ళు చేరినట్లే.

పప్పులో ఇసుక పులుసులో బొగ్గులుపడ్డట్లే ..

కొంగుజాపి కొంగునిండా మల్లెపూలు కట్టుకు తిరగాల్సిన కాపురంలో మొగుడు ఉద్యోజనం గాదయితే కథల్లో, నవలల్లోఅయితే నవ్వుకోడానికి సీక్వెన్స్‌వెంట సీక్వెన్సులు దొరుకుతాయోమోకాని జీవితంలో పడవ గట్టెక్కదు.

గ్లాసునిండా ప్రేమనింపుకొని మనసారా సుధను గ్రోలాలంటే—

మొగుడు వండర్ ఫుల్ మాన్ అయుండాలికాని మొద్దబ్బాయి కారాదు.

వండర్ ఫుల్ మాన్ అనగా? ఎసుమంటి వాడు?

చిదిమిన పాల్గారు చెక్కు టద్దములవాడు

అతన్తో రిక్షాలో కూర్చుంటేనే ఆడపిల్లలకు పుష్పక విమానం ఎక్కినట్లుండాలి.

అతన్తోటి కాపురం ఆరుప్లేట్ల సాంబారు మూడు ప్లేట్ల ఇడ్లీలాగా పచ్చగా వెచ్చగా హాయిగా ఆనందంగా సాగిపోవాలి.

నా మొగుడు చవటై నేను తిట్టే తిట్లన్ని సహించేవాడై యుండాలి అని కోరుకునే ఆడది

షి- డెవిల్ (రాక్షసిముండ)

కాని ఏ ఆడదాని మనసూ అంత డెవిలిష్‌గా వుండదు మొగు డంటే.

చూడచక్కనివాడు, గొట్టాం పాంట్లవాడు సూదిముక్కు బూట్ల వాడు, నొక్కు నొక్కుల జుత్తులవాడు, సిగరెట్టు కాలుస్తూ రింగు రింగుల వుంగరాలు తెప్పించి వుఫ్‌మని వూది కళ్ళల్లోకి నవ్వుతూ నీళ్ళు తెప్పించే టట్లు నవ్వించగలాడూ....

చిట్టి పొట్టి స్లాకులవాడూ

చీరలు రవికలు తెచ్చేవాడూ

మనసూ మర్మం తెలిసినవాడూ

ముక్కు మీద కోపంవాడూ. మూతిమీద తుమ్మెద రెక్కలవాడు!

కథలూ కబుర్లూ చెప్పగలవాడూ

క్లబ్బులూ పేకాట తెలిసినవాడూ

చతురుడూ. చమత్కార పురుషుడూ అయ్యుండాలి.

అతడే పూలరంగడు. అంతేకాని

కాలు కదపని వాడూ

గడప దాటని వాడూ

పెళ్ళానికి మరో ముద్దుబిడ్డలా చెంగుపుచ్చుకు తిరిగేవాడూ. పిండి వంటల పురుషుడూ భోజన ప్రియుడూ ప్రియుడెట్లాగవుతాడు?

ప్రియా ప్రియా అంటే క్యా క్యా అంటాడు మొగుళ్ళంతా ప్రియులు కానట్టే ప్రియులంతా మొగుళ్ళు కానక్కర్లేదు. పార్వతి దేవదాసు. లైలాకు మజ్నూ. సంమచిసర సుందరికి సుబ్బారావూ ప్రియులే అంటే ప్రియమైనవారు.

ప్రియమైన వారెప్పుడూ గుండెల్లో మంటలు రగిలిస్తారు.

కంటతడి తెప్పిస్తారు చీకట్లో చిరునవ్వుల దీపాలు వెలిగిస్తారు.

మొగుళ్ళు ప్రియులు కాజాలరని ఎందుకన్నానంటే ప్రియులు ప్రియురాళ్ళను చెట్లచుట్టు పరిగెత్తి పాడుకోమంటారు. ఉల్లిపొర దుస్తులు వేసుకుని అందంగా చవులూరించేలా కనపడమంటారు. ఆర ఆరగా ప్రేమను గ్లాసుల్లో త్రాగుదాం రాసఖీ అంటారు. అంతేకాని అంట్లుతోమించరు. చెంబులు పళ్ళేలు కడిగించరు. బట్టలు ఉతికించరు. చూస్తూ. చూస్తూ గొడ్డుచాకిరి అంతా చేయించరు.

"అలిగితివా సఖీ! అలుకమానవా -" అని పాడుతూ ప్రతిమా ల్తారు అందుకే మన కంట్రీలో భోజన ప్రియులున్నారు. కాని ప్రియుల్లేరు

మా వారిన్నేను "ప్రియ" అన్నాననుకోండి.

దీనికి మతోయిందేమా అని అనుమానంగా చూస్తారు. అల్లాగే - ప్రాణసఖీ"- అని ఆయన బయల్దేరారనుకోండి. పొట్టచేతో పట్టుకొని నవ్వాల్సిందే. లేకపోతే పిచ్చాసుపత్రికి త్రోవచూపాల్సిందే. పిచ్చాసుపత్రంటె జ్ఞాపకం వచ్చింది. మా వారికి పిచ్చాసుపత్రిలో కూడా స్నేహితులున్నారు. హాలిడే ఇన్ బాంబే లాగ హాలిడే ఇన్ పిచ్చాసుపత్రి చూద్దాం పద బైల్దేరుదాం రా అన్నారు.

ఐడోంట్ కేర్- ఐడోంట్ వాంట్ టుసీ పిచ్చాసుపత్రి- ఐవాంట్ టుసీ పూలరంగడూఅన్నా యూ ఇడియట్ అన్నారు.

ఏంటి గురూగారూ అన్నా- మా ఆయన మొహం నల్లగా పెంకులా మాడిపోయింది.

గురూగారూ అంటావా ఇడియట్ అన్నారు పళ్ళు పటపట లాడిస్తూ. మీ ఫ్రెండ్సంతా మిమ్మల్ని గురూగారూ అంటంలేదా! అప్పుడు మీ మొహం చాటంత అయిపోవడంలేదా- వ్హాట్ సార్- నేనంటేనే తప్పొచ్చిందా అని రెట్టించా.

నువ్వు గురూగురూ అన్నావంటే ఎవరైన వింటే నాకిక మంచి నీళ్ళు పుట్టవు అని టిక్క మొహం పెట్టారు.ఆల్ రైట్ ఎక్స్యూజ్ మి గురూగారూ అనన్లెండి. నన్ను పూలరంగడికి తీసికెళ్ళండి అన్నా.

హ్వా! మైస్వీట్ సుడ్ గాల్ అన్నారు.

యస్ డోయ్ అన్నాను. షటప్ అన్నారు.

నేను ఇంగ్లీషు మాట్లాడ్డం మీకు గిట్టలేదా అయితే హిందీ ప్రారంభిస్తానుండండి.

తుఝె మై గంగా సమఝూంగా।

తుఝె మై జమునా సమఝూంగా

బస్। బస్। ఆపవే అంటూ గోలెత్తారు.

తేరే ఘర్ కె సామ్నే

మై ఎక్ ఘర్ బసావుంగా?

[ఆపవే బాబూ నీహిందీహోరు]

ఇంతకీ చెప్పొచ్చే దేమంటే

"స్వీట్ హోమ్ అంటే తెల్లపు దిమ్మలతోనూ చేలుకు గడలతోనూ కట్టిన ఇల్లుకాదు పంచదారతోనూ పటికబెల్లంతోనూ జున్నుతోనూ జుంటి తేనెతోనూ చేసినా అది స్వీట్‌హోమ్ కాజాలదు.

ఇటీజ్ ది మొగుడూ అండ్ పెళ్ళాం హూ మేక్ ది హోమ్ వెరి వెరి స్వీట్ ఆర్ నాట్।